# వారం వారం

**శ్రీశ్రీ**

అందరికీ బోధపడేటట్లు వ్రాయడం అంటే ఏమిటో నాకు బోధపడలేదు ప్రసాదగుణం, స్ఫూర్తి ఇలాంటి మాటలు తెలిపే అభిప్రాయాన్ని ముందుగా ఒక నిఘంటువునో గురువునో సలహా చేసిన మీదటనే తెలుసుకోవాలి. 'ఆవు పాలుఇచ్చును' అని వ్రాస్తే అందరికీ తెలుస్తుంది నిజమే కాని మా యింట్లో (నాచిన్నప్పుడు) ఒక ఆవుఉండేది. అది కొన్నాళ్లు సరిగానే పాలు ఇచ్చిందిగాని తర్వాత మానేసింది-సరిగదా తన్నడంకూడా ప్రారంభించింది.

'అందరూ' అంటే ఎవరు? నేనైతే ఎందర్నో చూశానుగాని ఎక్కడా నాకు ఈ 'అందరూ' కనబడలేదు. అందరికోసం వ్రాయమని అడగడం అసందర్భం. అందరికోసం వ్రాస్తున్నాననుకోవడం ఆత్మవంచన.

అందరూ అంటే చదవడం నేర్చినవారందరూ అనే నిర్వచనం రావచ్చును. చదవడం నేర్చినవారందరూ చదివిన గ్రంథం ఒకటనేలేదు. తెలుగుమాట అలావుంచుదాము ఇంగ్లీషులో బైబిలువంటిది కూడా అందరివల్లా చదువబడనిదైనటువంటి గ్రంథమే! కాంగ్రెసువాళ్ళమనుకుంటూ గాంధీ ఆత్మకథను చదువని వ్యక్తులను స్వయంగా నేనెరుగుదును (కాంగ్రెసువారి మాటెందుకు, నా మట్టుకు నేనా గ్రంథాన్ని ఎప్పుడూ పూర్తిగా చదవలేదు.)

మనుచరిత్రను పూర్తిగా చదవడం కష్టంమీదపని అని స్వానుభవంవల్ల నేను చెప్పగలను.

పాఠశాలలలో ఉపాధ్యాయులు పత్రికలలో సంపాదకులు, ఆఫీసులలో ఉద్యోగులు, రాజకీయాలలో నాయకులు, వర్తకంలో ప్రముఖులు 'మహాభారతాన్ని పద్దెనిమిది పర్వాలూ చదివారా?' అనే ప్రశ్నకు ఏమని జవాబిస్తారో? (నేను చదవలేదని నిజంచెప్పేస్తున్నాను.)

అందరికీ బోధపడవలసిన అవసరం ఉన్న గవర్నమెంటు ఉత్తరువులే ఎవరికీ బోధపడని అయోమయపు భాషలో వెలువడుతూ ఉంటాయనే విషయం సుప్రసిద్ధమే.

పండితులు తమకుమాత్రమే బోధపడవలసిన సాంకేతిక భాష నొకదాన్ని సృష్టించుకున్నారు. అదే గ్రాంథిక భాష. రానురాను అది బిర్రబిగిసి కొమ్ములుతిరిగిన పండితులకు కూడా కొరకరానిదై పోయింది. గిడుగు రామమూర్తి పంతులు దానొక తాపుతంతే అదిప్పుడు విశ్వవిద్యాలయాలలో తలదాచుకుంటోంది.

ఒకటిమాత్రం ఒప్పుకోవాలి, సాహిత్యం, శాస్త్రం, మొదలైనవన్నీ ఇప్పుడు అందరికీ అందుబాటులోకివచ్చే అవకాశాలు హెచ్చాయి, అచ్చుయంత్రం, సినిమా, రేడియో ఉదాహరణలు. నేటి సామాజికవ్యవస్థను మార్చివెయ్యగలశక్తి వీటికుంది.

ఇంతవరకూ నేను వ్రాసింది సరిగా బోధపరచుకున్న వారుంటే (కొంతమంది ఉంటారని నాకు తెలుసు; వారికి నాకృతజ్ఞత) ఇంకో వాయిదాలో తతిమ్మా సంగతులు మనవిచేసుకుంటానని మనవి చేసుకుంటున్నాను.

## ఆనందవాణి

★

రచయితలు చాలామంది తాము పంపించే రచనలు ప్రకటింపబడతాయో లేదో తెలియక చాలా తహతహపడుతూ వుంటారు.

మీ రచనలతో బాటు పోస్టుబిళ్ళలు కూడా పంపిస్తే సాధ్యమైనంతత్వరలో, ప్రకటించేదీ లేనిదీ తెలియబరుస్తూ, ప్రకటించడానికి వీలులేనియెడల సదరు రచనలు త్రిప్పి పంపబడును.

ఆనందవాణికి ఏజంట్లు, చందాదార్లు మొదలయినవారు పంపించే మనియార్డర్లు వ్యక్తులపేరగాకుండా "మేనేజరు, ఆనందవాణి, నెం. 12, తంబుచెట్టి వీధి, మద్రాసు" అని వ్రాసి పంపవలెను.